క్లుప్తంగా

ఓటరు దరఖాస్తుకు చివరి గడువు 31

తుక్కుగూడ: పద్దెనిమిదేళ్లు నిండిన (అక్టోబర్ 1 నాటికి) యువతీయువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ సూచించారు. ఇందు కోసం ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత మృతి


వెంకట్‌రెడ్డి (ఫైల్)

బడంగ్‌పేట్: బడంగ్‌పేట మాజీ ఉపసర్పంచ్, కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు పెద్దబావి వెంకట్‌రెడ్డి(55) శుక్రవారం మృతిచెందాడు. ఇటీవల వినాయక చవితి వేడుకల్లో భాగంగా బడంగ్‌పేట వీరాంజనేయ భక్త సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక లడ్డూను వెంకట్‌రెడ్డి రూ.17లక్షలకు కైవసం చేసుకుని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి బహుమానంగా అందజేశారు. వెంకటరెడ్డికి భార్య పుష్పలత, కుమారుడు మధుకర్‌రెడ్డి ఉన్నారు. ఆయన మృతికి స్థానిక నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

తల్లిదండ్రుల ఆశీర్వాదంతో..

ప్రచారాన్ని ప్రారంభించిన బీజేపీ అభ్యర్థి అందెల


తల్లితండ్రుల ఆశీర్వాదం తీసుకుంటున్న అందెల శ్రీరాములుయాదవ్

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లో పలు పార్టీల అభ్యర్థులు ప్రచారం మొదలు పెట్టారు. బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ మొదట తల్లితండ్రుల ఆశీర్వాదం తీసుకొని ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం తన సొంత గ్రామమైన నాదర్‌గుల్‌లో సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం బీజేపీ నేతలతో, కార్యకర్తలతో కలిసి అందెల శ్రీరాములు ప్రచారం చేశారు. మీ అమూల్యమైన ఓటును కమలం గుర్తుకే వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆయన వెంట పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు మహిళలు ఉన్నారు.

సంక్షేమమే లక్ష్యం


సరూర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న పట్లోళ్ల కళ్యాణ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

హుడాకాంప్లెక్స్: సర్వజనుల సంక్షేమమే సబితమ్మ లక్ష్యమని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి బేర బాలకిషన్ అన్నారు. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి గెలుపునకై శుక్రవారం సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని హుడాకాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. యువ నాయకులు పట్లోళ్ల కళ్యాణ్‌రెడ్డితో కలిసి ప్రచార రథంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని ప్రజలు ఆశించిన స్థాయిలో ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధి చేసి చూపారని, కాంగ్రెస్, బీజేపీ మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు. దేశంలోనే తెలంగాణను నెంబర్ వన్ స్థానంలో నిలిపారని చెప్పారు. మహేందర్ యాదవ్, ఇంటూరి అంకిరెడ్డి, లోకసాని కొండల్‌రెడ్డి, మొగిల్ల మల్లేష్, పోలె అరవింద్, మాజీ కార్పొరేటర్ అనితా దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లెలగూడలో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం


జిల్లెలగూడలో ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు

మీర్‌పేట: సంక్షేమం, అభివృద్ధి కోరుకునే వారంతా కారు గుర్తుకు ఓటు వేసి విద్యాశాఖా మంత్రి సబితా ఇంద్రారెడ్డిని మరోసారి గెలిపించాలని మీర్‌పేట కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లెలగూడలోని పలు డివిజన్లలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సిద్దాల లావణ్య, అర్కల భూపాల్‌రెడ్డి, కొండ్ర గౌరీశంకర్, దీప్‌లాల్ చౌహాన్, మేకల రవిందర్‌రెడ్డి, యాదగిరి ముదిరాజ్, వంటేరు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తవ్వి.. వదిలేశారు!

- పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు
- రోడ్డుపైనే మురుగు
- దారి మొత్తం గుంతలమయం
- ఇబ్బందుల్లో వాహనదారులు


గాయత్రినగర్ ప్రధాన రహదారి దుస్థితి

మీర్‌పేట: డ్రైనేజీ పైపులైన్ సమస్యను సాకుగా చూపి రెండు నెలలుగా ఎక్కడి పనులు అక్కడే వదిలేశారు. వివరాల్లోకి వెళితే.. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని గాయత్రినగర్ ప్రధాన రహదారి అభివృద్ధి పనులను మూడు నెలల క్రితం ప్రారంభించారు. పైకాలనీల నుంచి డ్రైనేజీ ఓవర్ ఫ్లో కారణంగా కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలేయడంతో రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో డ్రైనేజీ నీరు రోడ్డుపైనే నిలిచిపోవడంతో వాహనదారులు, స్థానిక కాలనీలవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి కావడం.. పనులు అసంపూర్తిగా వదిలేయడంతో చేసేది లేక అవస్థలు పడుతూనే రాకపోకలు కొనసాగిస్తున్నామని వాహనదారులు తెలిపారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో ఇటీవల ఓ వృద్ధుడు, యువకుడు ద్విచక్ర వాహనాల పైనుంచి కిందపడి గాయాలపాలయ్యారని స్థానికులు చెప్పారు. డ్రైనేజీ నీరు రహదారిపైనే నిలిచి ఉండడంతో దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక కాలనీవాసులు పేర్కొంటున్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిని

సంబంధిత కార్పొరేషన్ అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారాలు దెబ్బతింటున్నాయి..

రోడ్డును తవ్వి వదిలేయడంతో మూడు నెలలుగా వ్యాపారాలు దెబ్బతింటున్నాయని స్థానిక దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై డ్రైనేజీ మ్యాన్‌హోల్ గుంతలు ప్రమాదకరంగా ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. డ్రైనేజీ సాకుతో పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్ కనీసం మట్టి పోసైనా రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని దుకాణదారులు కోరుతున్నారు.


రహదారిపై ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

వారంలో పనులు పూర్తి చేస్తాం

డ్రైనేజీ ఓవర్ ఫ్లో వల్ల పనుల్లో కొంత ఆలస్యమైంది. ముందుగా నూతన డ్రైనేజీ పైపులైన్ వేసి ఆ తర్వాత రోడ్డు పనులను పూర్తి చేస్తాం. వారంలోగా పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.

– గోపీనాథ్, డీఈ, మీర్‌పేట కార్పొరేషన్

జోరుగా బీఆర్ఎస్ ప్రచారం


బడంగ్‌పేటలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలో బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకర్గం అభ్యర్థి పట్లోళ్ల సబితారెడ్డి తరుపున బీఆర్ఎస్ నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇప్పటికే ఒక దఫా ప్రచారాన్ని పూర్తి చేసిన నాయకులు రెండో దఫా ప్రచారం నిర్వహిస్తున్నారు. నాదర్‌గుల్‌లో కోఆప్షన్ సభ్యులు జగన్మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మమత సుదర్శన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మంజుల కుమార్‌గౌడ్ తదితరులు శుక్రవారం నాదర్‌గుల్ చౌరస్తాలో ప్రచారం నిర్వహించారు.

బీఆర్ఎస్ కార్పొరేటర్ల ప్రచారం...

బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు ఇంటింటి ప్రచారం మొదలు పెట్టారు. బడంగ్‌పేట పాత విలేజీలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. సబితారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు. ప్రచారంలో పాల్గొన్నవారిలో సీనియర్ నాయకులు పి.ఆనంద్‌రెడ్డి, కార్పొరేటర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ అర్జున్, బి.జంగారెడ్డి, సింహారెడ్డి, మహేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గుర్రం వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రాజు, ఎస్సీ సెల్ నాయకులు పి.సంతోష్, తదితరులు పాల్గొన్నారు.


నాదర్‌గుల్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

'అల్పాహారం' బడ్జెట్ పెంచాలని వినతి


ఆర్డీఓకు వినతి పత్రం అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, సీఐటీయూ నాయకులు

కందుకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయనున్న అల్పాహారం పథకానికి బడ్జెట్ పెంచాలని కోరుతూ సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్డీఓ సూరజ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన సంఘం మండల అధ్యక్షురాలు ప్రభావతి మాట్లాడారు. నవంబర్ 1వ తేదీ నుంచి పాఠశాలల్లో ఇడ్లీ, పూరి, ఉప్మా, కిచిడి చట్నీలతో విద్యార్థులకు అల్పాహారం కింద అందించాలని ప్రభుత్వం జీఓ జారీ చేసిందన్నారు. అందులో కేవలం ఒక్కో విద్యార్థికి రూ.8.50 నుంచి రూ.10.50 వరకు ప్రభుత్వం మంజూరు చేస్తుందని చెబుతున్నారన్నారు. కానీ ఆ బడ్జెట్‌తో ఎలా అల్పాహారం అందించగలమని ప్రభావతి ప్రశ్నించారు. ఒక్కో విద్యార్థికి రూ.20 చెల్లించడంతో పాటు నెలకు రూ.6 వేలు అందించాలని డిమాండ్ చేశారు. కోడిగుడ్డుకు బహిరంగ మార్కెట్‌లో ధర చెల్లించాలని, గ్యాస్, ఇతర సామగ్రి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు శ్రీనివాస్, కిషన్‌జీ, అండాలు, సుజాత, విజయ, శంకరమ్మ, శైలజ, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

దేశానికే అన్నపూర్ణగా తెలంగాణ

విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి


కందుకూరులో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

కందుకూరు: దేశంలో రాష్ట్రాన్ని అన్నపూర్ణగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి కొనియాడారు. శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం సామ నర్సింహారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో కలిసి పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి, మిషన్ భగీరథ వంటి ప్రాజెక్టులు చేపట్టడంతో తెలంగాణలో జల సవ్వడి ఎగిసిపడుతుందన్నారు. 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేసీఆర్‌లా అందరూ కష్టపడి పని చేయాలన్నారు. మరోసారి కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చి బీఆర్ఎస్ జెండా ఎగురవేద్దామన్నారు. కారు గుర్తుకే ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, సీఎం అభ్యర్థి ఎవరనేది చెప్పుకోలేని పరిస్థితి ఉందన్నారు. 52 ఏళ్లు పాలించిన పార్టీలు చేసిందేమీ లేదని విమర్శించారు. మ్యానిఫెస్టోలో లేనివి కూడా అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. మహేశ్వరంలో అధిక మెజార్టీతో సబితమ్మను గెలిపించుకునే బాధ్యత తీసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఇందిరదేవేందర్, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, నియోజకవర్గం ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, అంజయ్యగౌడ్, కాకి దశరథ, ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు చిర్ర సాయిలు, లచ్చునాయక్, రైతు బంధు అధ్యక్షుడు కృష్ణరాంభూపాల్‌రెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి, డైరెక్టర్లు ఆనంద్, శేఖర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, భిక్షపతి, పాండుగౌడ్, సామయ్య, దామోదర్‌గౌడ్, దేవీలాల్, దావూద్, బాబయ్య, పారిజాతం, అమరేందర్‌రెడ్డి, సామ ప్రకాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

పట్లోళ్ల కార్తీక్ రెడ్డి



పార్టీ కార్యాలయ ప్రారంభంలో మాట్లాడుతున్న కార్తీక్ రెడ్డి

పహాడీషరీఫ్: రాష్ట్రం అన్ని రకాల అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ సీనియర్ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో గురువారం రాత్రి ఆయన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చుతూ స్వాగతం పలికారు. అనంతరం కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ జల్‌పల్లి మున్సిపాలిటీలో వందల కోట్ల అభివృద్ధి పనులు చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. చేసిన అభివృద్ధిని ప్రతి ఇంటికి తిరిగి వివరించాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేయించాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూరెడ్డి కృష్ణారెడ్డి, యంజాల జనార్దన్, దూడల శ్రీనివాస్ గౌడ్, ఉష్కెమూరి నిరంజన్, యంజాల అర్జున్, షేక్ అఫ్జల్, సయీద్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

'చిగురింత'కు భంగపాటు

- చేజారిన కాంగ్రెస్ టికెట్
- మరోసారి వలస నేతకే అవకాశం కల్పించిన హస్తం పార్టీ
- పారిజాత మద్దతుదారుల్లో నిరుత్సాహం


చిగురింత పారిజాత

బడంగ్‌పేట్: కాంగ్రెస్ తరపున మహేశ్వరం టికెట్ ఆశించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డికి చివరి నిమిషంలో భంగపాటే ఎదురైంది. దీంతో ఆమె తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. కాంగ్రెస్ పార్టీ నుంచి కార్పొరేటర్‌గా ఎన్నికైన పారిజాత బీఆర్ఎస్‌లో చేరి మేయర్ పీఠాన్ని దక్కించుకున్నారు. ఆ పార్టీలో ఇమడలేక తిరిగి హస్తం గూటికి వచ్చేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం శ్రమిస్తున్న పారిజాతను గుర్తించిన అధిష్టానం ఆమెకు పీసీసీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు కట్టబెట్టింది. ఈ క్రమంలో తుక్కుగూడ వద్ద నిర్వహించిన పార్టీ జాతీయ స్థాయి బహిరంగ సభను విజయవంతం చేయడంలోనూ పారిజాత సక్సెస్ అయ్యారు. చాలా మంది సీనియర్లు ఉన్నప్పటికీ ఈసారి టికెట్ ఆమెకే వస్తుందని అందరూ భావించారు. అధిష్టానం సైతం ఇదే విషయాన్ని పలు సందర్భాల్లో పేర్కొంది. కానీ చివరి నిమిషంలో టికెట్ చేజారిపోవడంతో చిగురింత మద్దతుదారులు నిరుత్సాహానికి లోనవుతున్నారు.

మూగబోయిన లోకల్ నినాదం

మహేశ్వరం నియోజకవర్గం ఏర్పడిన నాటినుంచి పార్టీ నాన్ లోకల్ వాళ్లకే టికెట్లు కేటాయిస్తూ వస్తోంది. ఈసారి కూడా కేఎల్లార్ (కిచ్చెనగారి లక్ష్మారెడ్డి)కు ఇచ్చింది. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని బాలాపూర్‌కు చెందిన పారిజాతకు అవకాశం వస్తే.. లోకల్ నినాదం వినిపిద్దామని భావించినా ఫలితం తారుమారైంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు, మేయర్ మద్దతుదారులు కేఎల్లార్‌కు ఏమేర సహకరిస్తారో వేచి చూడాల్సిందే. ఇదిలా ఉండగా.. అధిష్టాన నిర్ణయాన్ని శిరసా వహిస్తూ పారిజాత కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకోసం పనిచేస్తారా..? మరే దారైనా చూసుకుంటారా అనేది వేచిచూడాల్సిందే.

హామీల అమలులో విఫలం

ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

హయత్‌నగర్: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ ఆరోపించారు. హయత్‌నగర్‌లో ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణచారి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బూటకపు హామీలతో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తోందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు రాకుండా పేపర్‌ల లీకేజీలు జరిగాయని, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, మత్తు మాఫియా విజృంభిస్తుందని, మహిళలకు రక్షణ కరువైందని ఆరోపించారు. ఈనెల 29, 30న జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సభలకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కిశోర్, నాయకులు శ్రీనివాస్, దేవేందర్, శ్రీకాంత్, వెంకటేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 17, వంకాయ 28, బెండ 28, పచ్చిమిర్చి 40, కాకర 23, బీర 23, క్యాబేజీ 16, ఫ్రెంచిబీన్స్ 65, క్యారెట్ 40, దొండ 15–18, చిక్కుడు 35–65, గోకర 28, బీట్‌రూట్ 28, క్యాప్సికం 45, ఆలు 21, ఉల్లిగడ్డ 44, చామగడ్డ 37. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

రేపు బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక

వనస్థలిపురం: బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్, వనస్థలిపురం ఆధ్వర్యంలో బ్రాహ్మణ వధూవరుల 15వ వార్షిక పరిచయ వేదికను ఈ నెల 29న వనస్థలిపురంలోని శ్రీ సీతారామచంద్ర ఆలయం ప్రాంగణంలో నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు పోచంపల్లి శ్రీధరరావు, కార్యదర్శి నందిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరిచయ వేదిక కొనసాగుతుందన్నారు. స్పాట్ రిజిస్ట్రేషన్ కలదని, ఇతర వివరాలకు ఫోన్ నం. 6302454218ను సంప్రదించాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం గోలి శ్రీనివాస్‌రెడ్డిని పలువురు బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ ఖలీల్, జహంగీర్, సైదులు, సతీష్, కాలె విక్రం, శివ, జంతుక కిరణ్, పురుషోత్తం, వెంకటయ్య, బీమయ్య తదితరులు పాల్గొన్నారు.

చేపలు పట్టడానికి వెళ్లి..

- బావిలో శవమై తేలాడు
- కందకూరులో విషాదఛాయలు


అంజయ్య (ఫైల్)

కందుకూరు: చేపలు పట్టడానికి రెండు రోజుల క్రితం బావి వద్దకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు అదే బావిలో మునిగి మృతి చెందిన సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. కందుకూరుకి చెందిన అంజయ్య(42) ట్రాక్టర్ డ్రైవర్‌గా, కూలీగా పనులు చేసుకుంటూ మరోపక్క చేపలు పడుతుంటాడు. ఈనెల 25న గ్రామ సమీపంలోని శివాలయం ఎదుట ఉన్న బావిలో చేపలు పట్టడానికి వల వేశాడు. అదేరోజు రాత్రి 10.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమయ్యాడు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులు అంజయ్య కోసం ఎంతగాలించిన ఫలితం లేకుండా పోయింది. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలో బావి వైపు రాత్రి సమయంలో వెళ్తున్నట్లుగా రికార్డు అయింది. దీనికి తోడు ఆ బావి ఒడ్డున అంజయ్య బట్టలు, చెప్పులు లభ్యమయ్యాయి. అదే రోజు సాయంత్రం బావిలో మోటార్ల సహాయంతో నీటిని తోడే ప్రయత్నం చేపట్టారు. అయితే బావిలో నీరు నిండుగా ఉండటంతో పాటు ముళ్ల కంపలు ఉండటంతో గాలించడానికి వీలుకాలేదు. శుక్రవారం సాయంత్రం సమాచారం అందుకున్న ఆర్డీఓ సూరజ్‌కుమార్, తహసీల్దార్ గోపాల్, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని పర్యవేక్షించారు. మోటార్లతో నీటిని అడుగువరకు తోడటంతో రాత్రి 7 గంటల సమయంలో మృతదేహం బయటపడింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పోరు రసవత్తరం

- ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ అభ్యర్థిగా మల్‌రెడ్డి
- ఇప్పటికే ఖరరైన బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు
- టగ్‌ఆఫ్ వార్ తప్పదంటున్న విశ్లేషకులు

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ అధిష్టానం ఆ పార్టీ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థిగా మల్‌రెడ్డి రంగారెడ్డిని ప్రకటించడంతో నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1994(టీడీపీ), 2004(కాంగ్రెస్)లో మలక్‌పేట్ ఎమ్మెల్యేగా మల్‌రెడ్డి రంగారెడ్డి పనిచేశారు. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం కందుకూర్, మహేశ్వరం మండలాలు మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోకి, హయత్‌నగర్ మండలం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోకి రావడంతో ఈ(ఇబ్రహీంపట్నం)సెగ్మెంట్ ఎస్సీ నుంచి జనరల్ స్థానంగా మారింది. ఈ నేపథ్యంలో 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా మల్‌రెడ్డి రంగారెడ్డి ఇక్కడి నుంచి పోటీ చేశారు. అప్పట్లో ఆయనకు పోటీగా టీడీపీ నుంచి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, పీఆర్పీ నుంచి తూళ్ల దేవేందర్‌గౌడ్, బీజేపీ నుంచి పోరెడ్డి నర్సింహారెడ్డి బరిలో నిలిచారు. మంచిరెడ్డి కిషన్ రెడ్డికి 56,508 ఓట్లు రాగా.. మల్‌రెడ్డి రంగారెడ్డికి 47,292 ఓట్లు, తూళ్ల దేవేందర్‌గౌడ్‌కు 35,179 ఓట్లు, పోరెడ్డి నర్సింహారెడ్డికి 8,218 ఓట్లు వచ్చాయి. ఆ ఎన్నికల్లో 9,216 ఓట్ల మెజార్టీతో టీడీపీ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమీప అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిపై విజయం సాధించారు.

రాష్ట్ర విభజన అనంతరం..

అయితే రాష్ట్ర విభజన అనంతరం జరిగిన 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా మల్‌రెడ్డి రంగారెడ్డి సోదరుడు మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా క్యామ మల్లేశ్, టీఆర్ఎస్ అభ్యర్థిగా కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి, సీపీఎం అభ్యర్థిగా పగడాల యాదయ్య, వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఈసీ శేఖర్‌గౌడ్ ప్రధానంగా పోటీపడ్డారు. మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి 48,397 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి మల్‌రెడ్డి రాంరెడ్డికి 37,341 ఓట్లు, క్యామ మల్లేష్‌కు 36,865 ఓట్లు, కంచర్ల చంద్రశేఖర్ రెడ్డికి 21,779 ఓట్లు, పగడాల యాదయ్యకు 14,902, ఈసీ శేఖర్‌గౌడ్‌కు 10,881 ఓట్లు వచ్చాయి. దీంతో టీడీపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి 11,056 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి 2014 ఎన్నికల అనంతరం టీఆర్ఎస్‌లో చేరారు.

356 ఓట్లతో మంచిరెడ్డి గెలుపు..

తదనంతరం 2018లో టీఆర్ఎస్ అభ్యర్థిగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఎస్పీ నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, పొత్తులో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఈ స్థానం టీడీపీకి కేటాయించడంతో సామ రంగారెడ్డి బరిలో నిలిచారు. మంచిరెడ్డికి 72,581 ఓట్లు, మల్‌రెడ్డికి 72,205 ఓట్లు, సామ రంగారెడ్డికి 18,053 ఓట్లు, కొత్త అశోక్‌గౌడ్‌కు 17,129 ఓట్లు వచ్చాయి. బీఎస్పీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిపై టీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి 356 ఓట్ల స్వల్ప మెజార్టీతో గెలుపొందారు. తిరిగి ఈసారి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి బీఆర్ఎస్ నుంచి, మల్‌రెడ్డి రంగారెడ్డి కాంగ్రెస్ నుంచి, బీజేపీ నుంచి నోముల దయానంద్‌గౌడ్ ప్రధాన పార్టీల అభ్యర్థులుగా రంగంలో దిగనున్నారు.

వేడెక్కనున్న రాజకీయం..

ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావడంతో ఇబ్రహీంపట్నంలో రాజకీయ వేడెక్కనుంది. ఇప్పటికే బీఆర్ఎస్ నియోజకవర్గంలో ఒక రౌండ్ ప్రచారాన్ని పూర్తి చేసింది. 356 ఓట్లతో గత ఎన్నికల్లో ఓడిపోయిన మల్‌రెడ్డి ఈసారి ఏలాగైన విజయం సాధించాలనే పట్టుదలతో ఉన్నారు.

గ్రూప్‌లు సర్దుకుంటేనే..

టికెట్ ఆశించి భంగపడ్డ కాంగ్రెస్ ఆశావాహులు మర్రి నిరంజన్‌రెడ్డి, దండెం రాంరెడ్డిడీసీ శేఖర్‌గౌడ్ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి విజయానికి ఏ మేర సహకరిస్తారో వేచి చూడాలి. ఆశావాహులతో పాటు పార్టీలోని గ్రూప్ రాజకీయాలు పక్కకు పెడితేనే బలమైన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని ఢీకొట్టే అవకాశం ఉంటుంది. గ్రూప్‌లు సర్దుకోకుంటే పాత కథనే పునరావృతం అయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.